సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 15 । నవంబర్ । 2024



యంత్రాల కొరత..
వరి రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఓ వైపు మబ్బులు.. మరో వైపు కూలీలు, యంత్రాలు దొరక్క అవస్థలు పడుతున్నారు. 8లో ▸



బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం
బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప అన్నారు. 8లో ▸



రైతుల సంక్షేమమే లక్ష్యం
రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యమని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీఓ నాగలింగాచారి పేర్కొన్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

భయం గుప్పిట్లో తండాలు
కొడంగల్: దుద్యాల్ మండలం లగచర్ల గ్రామంలో కలెక్టర్, అధికారులపై దాడి చేసిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. 47 మంది దాడికి పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు మంగళవారం రాత్రి 16మందిని, బుధవారం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో పాటు మరో నలుగురిని అరెస్టు చేశారు. మిగిలిన వారి కోసం నాలుగు బృందాలు గాలిస్తున్నాయి. లగచర్ల గ్రామం ఇప్పటికీ భయం గుప్పిట్లోనే ఉంది. దాడికి పాల్పడిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. కొంతమంది యువకులు గ్రామం వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లినట్లు సమాచారం. వారిపై పోలీసులు నిఘా పెట్టారు. ఇప్పటికే 21 మందిని అరెస్టు చేయగా మరో 26 మంది కోసం గాలిస్తున్నారు. పోలీసుల జాబితాలో ఎవరి పేరు ఉందో తెలియక గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు మాత్రం గుట్టుచప్పుడు కాకుండా దొరికిన వారిని దొరికినట్లు విచారణ కోసం తరలిస్తున్నారు. గ్రామాల్లో కొంత మంది ఉన్నా ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

నర్సింగ్ కళాశాలకు భవనం పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్: నియోజకవర్గానికి ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన బీఎస్సీ నర్సింగ్ కళాశాల కోసం కలెక్టర్ ప్రతీక్‌జైన్ గురువారం భవనాన్ని పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ఇంటిగ్రేటెట్ గురుకుల పాఠశాలను, అక్కడి వసతులను పరిశీలించారు. మరుగుదొడ్లు, వసతి, స్నానపు గదులు, తరగతి గదులు, ఇతర సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. బీఎస్సీ నర్సింగ్ కళాశాలలో మొదటి ఏడాది 60 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుందని తెలిపారు. అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మార్గాలను అన్వేషిస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలి
అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి

ధారూరు: చదువుకునే సమయంలోనే మార్గాలను అన్వేషిస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. యంగ్ ఓరియంటేషన్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని, దాన్ని చేరుకునే వరకు శ్రమించాలని సూచించారు. సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని తెలిపారు. అనంతరం ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాకు బానిసలు కారాదని, అవసరమైన సమాచారాన్ని తెలుసుకునేందుకు మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ ఆర్గనైజర్ పవిత్ర, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తేరుకోని ఫార్మా పల్లెలు

ఖాళీగానే దర్శనమిస్తున్న తండాలు
- అజ్ఞాతంలో బాధిత రైతులు
- నిందితుల కోసం కొనసాగుతున్న పోలీసుల గాలింపు



లగచర్ల ప్రధాన చౌరస్తాలో మాట్లాడుకుంటున్న స్థానికులు

దుద్యాల్: లగచర్ల ఘటన జరిగి నాలుగు రోజులు కావస్తున్నా ఫార్మా బాధిత తండాల్లో పరిస్థితులు కొలిక్కిరావడం లేదు. దుద్యాల్ మండలం లగచర్ల, రోటిబండ తండా, పులిచెర్లకుంట తండాల్లో ప్రజలను భయం వీడటం లేదు. ఏ వీధిని చూసినా ఖాళీగానే దర్శనమిస్తోంది. రోటిబండ తండా, పులిచెర్లకుంట తండాల్లో ఇళ్లకు తాళాలు దర్శనమిస్తున్నాయి. అధికారులపై దాడి జరిగింది మొదలు నేటి వరకు ప్రజలు ఇళ్లకు రావడం లేదు. మంగళవారం అర్ధరాత్రి గ్రామంలోకి ప్రవేశించిన పోలీసులు దొరికిన వారిని దొరికినట్లు అదుపులోకి తీసుకున్నారు. దాడితో సంబంధం లేని 39 మందిని విడిచిపెట్టారు. 26 మంది కోసం నాలుగు బృందాలు గాలిస్తున్నాయి.

మేకలను ఎత్తుకెళ్లిన దుండగులు

రోటిబండ తండాలో ప్రజలు లేకపోవడంతో ఇదే అదనుగా భావించిన దుండగులు మేకలను ఎత్తుకెళ్లారు. తండాకు చెందిన ముత్యాలి బాయి అనే వృద్ధురాలి తన మనుమరాలితో కలిసి జీవనం సాగిస్తోంది. వారి వద్ద మేకలు ఉన్నట్లు గుర్తించిన దుండగులు అర్ధరాత్రి ఇంటికి వచ్చి పోలీసులమి చెప్పి రెండు మేకలను ఎత్తుకెళ్లారని బాధితులు తెలిపారు. ఎవరికి వారు వచ్చి బెదిరిస్తున్నారని తండా వాసులు వాపోతున్నారు. వెంటనే రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



నిర్మానుష్యంగా రోటిబండ తండా

పోలీసులు ఏమీ అనలేదు



అధికారులపై దాడి అనంతరం అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం పూర్తిస్థాయిలో వివరాలు సేకరించారు. దాడికి సంబంధించిన వీడియోలను పరిశీలించారు. ఫార్మాసిటీ నోటిఫికేషన్‌లో మా భూములు లేవని చెప్పడంతో వదిలిపెట్టారు.

– మాదారం బిచ్చప్ప, లగచర్ల

మేకలు ఎత్తుకెళ్లారు



మంగళవారం అర్ధరాత్రి పోలీసులు మా ఇంట్లో తనిఖీలు చేశారు. కొడుకు, కోడలు ముంబైలో ఉన్నారని చెప్పాం. ఇంట్లో మగవాళ్లు ఎవ్వరూ లేరని తెలుసుకుని వెళ్లిపోయారు. తెల్లవారుజామున చూస్తే రెండు మేకలు కనిపించ లేదు. పోలీసులు ఎత్తుకెళ్లారో.. లేక దొంగలు ఎత్తుకెళ్లారో అర్థం కావడం లేదు. తండాకు రక్షణ లేకుండా పోయింది. గ్రామంలో పరిస్థితి చక్కబడేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ముత్యాలి బాయి, రోటిబండ తండా

మాకు దారేది?



మాకు 3.5 ఎకరాల భూమి ఉంది. ఇదంతా ఫార్మాలో పోతోంది. తరతరాల నుంచి పంటలు సాగు చేసుకుంటూ జీనవం సాగిస్తున్నాం. ఫార్మా కోసం భూములు తీసుకుంటే మేము ఎలా బతకాలి. నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నాను. మూడు రోజులుగా ఇంటర్‌నెట్ సేవలను నిలిపేశారు. ఆన్‌లైన్ క్లాసులు వినలేకపోయా.. అధికారులు మా భవిష్యత్ గురించి ఆలోచన చేయాలి.

– పూజ, విద్యార్థిని, రోటిబండ తండా



జూమ్ మీటింగ్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

గ్రూప్–3కి పకడ్బందీ ఏర్పాట్లు
కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: జిల్లాలో గ్రూప్–3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17, 18 తేదీల్లో గ్రూప్–3 పరీక్షలు జరుగుతాయని, పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. చీఫ్ సూపరింటెండెంట్లు ప్రతి కేంద్రాన్ని విజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, ఫర్నిచర్, కనీస వసతులు ఉండాలని తెలిపారు. 17వ తేదీ ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షలు జరుగుతాయన్నారు. 18వ తేదీ మధ్యాహ్నం సెషన్‌లో పరీక్ష ఉంటుందని వివరించారు. ఉదయం 9.30 గంటల వరకే పరీక్ష కేంద్రాల్లో అనుమతిస్తారని చెప్పారు. చీఫ్ సూపరింటెండెంట్లు మాత్రమే మొబైల్ ఫోన్లు తీసుకెళ్లవచ్చని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రశ్న పత్రాలు, ఇతర సామగ్రిని పోలీసు బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్ నుంచి ఎగ్జామినేషన్ సెంటర్లకు తరలించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, సూపరింటెండెంట్ నేహమత్ అలి తదితరులు పాల్గొన్నారు.

'ధరణి' దరఖాస్తులు పరిష్కారం కావాలి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న 7,600 దరఖాస్తులను వచ్చే రెండు నెలల్లో పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, సెక్షన్ సూపరింటెండెంట్స్‌తో కలిసి పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ మాడ్యూల్స్ కింద దాఖలైన దరఖాస్తులను రెండు నెలల్లో పరిష్కరించాలని సూచించారు. రోజు వారీగా లక్ష్యాన్ని నిర్దేశించుకోని జనవరి 15 లోపు పెండింగ్ జాబితాను పూర్తిగా క్లియర్ చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ సంగీత, ఏఓ సునీల్ తదితరులు పాల్గొన్నారు.



బాలల దినోత్సవంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

విద్య ఆయుధం కావాలి: కలెక్టర్

అనంతగిరి: విద్యార్థులకు చదువే ఆయుధం కావాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బాగా చదువుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. చదువును అశ్రద్ధ చేయరాదని సూచించారు. గురువారం వికారాబాద్‌లోని సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నెహ్రూ పుట్టిన రోజును బాలల దినోత్సవం జరుపుకోవడం సంతోషమన్నారు. ఇది మన రోజు.. మనం బాగా ఉండాలి, బాగా చదవాలి, ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలి.. జిల్లాకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. నేను మీలాగే కష్టపడి చదివి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. బాల్యం నుంచే చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం పరిగి బాలసదనం విద్యార్థినుల నృత్య ప్రదర్శనను తిలకించారు. చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అంతకుముందు పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి, శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి, కాంతారావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చదువుకుంటేనే భవిష్యత్

అనంతగిరి: అమ్మాయిలు సమాజంలో రాణించాలంటే చదువుతోనే సాధ్యమవుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్ అన్నారు. గురువారం వికారాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో చిల్డ్రన్స్ డే సెలబ్రేషన్స్ జరిగాయి. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. చక్కటి వ్యాసం రాసిన వారికి బహుమతులు అందజేశారు. మొదటి స్థానంలో నిలిచిన సుప్రియను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు అబ్బాయి, అమ్మాయిలను సమానంగా చూడాలన్నారు. బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. బాల్యవివాహాలు చేయడం నేరమన్నారు. అమ్మాయిల భద్రత అందరి బాధ్యత అన్నారు. చదువుకుంటేనే భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో లీగల్‌ఎడ్ న్యాయవాదులు వెంకటేశం, రాము, న్యాయవాది ఏ రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం, వీరేశం, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి డీబీ శీతల్

జైళ్లకు భయపడే ప్రసక్తే లేదు

- రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది
- రైతులు, రాష్ట్ర ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం కొనసాగుతుంది
- లగచర్ల కేసుతో సంబంధం లేని వారిపై కేసులు పెడుతున్నారు
- అమాయకులను నిర్బంధించారు
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- పరిగి జైలులో ఫార్మా బాధిత రైతుల పరామర్శ



జైలులో ఫార్మా బాధిత రైతులను కలిసి బయటికి వస్తున్న సబితారెడ్డి తదితరులు

పరిగి: ఎన్ని కేసులు పెట్టినా, జైలుకు పంపినా సరే.. రైతుల పక్షాన పోరాటం చేసేందుకు భయపడే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బాధితులకు అండగా నిలిచేందుకు బీఆర్‌ఎస్ సిద్ధంగా ఉంటుందని స్పష్టంచేశారు. పరిగి సబ్ జైలులో ఉన్న ఫార్మా బాధిత రైతులను కలిసి మాట్లాడారు. గురువారం పలువురు మాజీ ఎమ్మెల్యేలతో వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఘటన ఎలా జరిగింది..? ఎవరిపై కేసులు పెట్టారు.. ఎవరిని అరెస్టు చేసి జైలుకు పంపారు? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరూ బాధపడొద్దని, బీఆర్‌ఎస్ తరపున తామంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. జైల్లో, బయట ఉన్న ఫార్మా బాధితుల పరిస్థితిని చెప్పడం కూడా కష్టంగా ఉందన్నారు. దాడుల్లో పాల్గొనని వారిని సైతం జైలు పాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అమాయక ప్రజలను కొట్టడంతో పాటు బలవంతంగా కేసులు ఒప్పించి, రిమాండ్ చేయడం అన్యాయమని తెలిపారు. 55 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు.. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని వదిలేసి, బీఆర్‌ఎస్ మద్దతుదారులను లోపల వేశారని మండిపడ్డారు. సీఎం సొంత నియోజకవర్గంలో ఆయనకు ఓట్లేసిన ప్రజలపై కేసులు పెట్టిస్తారా అని నిలదీశారు. తన సొంత నియోజకవర్గంలో ఇంత గొడవ జరుగుతున్నా ముఖ్యమంత్రి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రైతులకు భరోసా కల్పించాల్సిందిపోయి, కేసులు పెట్టించి జైలు పాలు చేస్తారా.. అని నిలదీశారు. లగచర్లతో పాటు తండాల్లో రాత్రివేళ జొరబడిన పోలీసులు, కనిపించిన వారిని కొట్టడంతో పాటు భయానక వాతావరణం సృష్టించారని, కేసుతో ఏ సంబంధం లేని వారిని సైతం పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు. ఆడపిల్లలు అడ్డం వాస్తే వాళ్లపై కూడా దాడులు చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యార్థులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం అమాయకులను జైలు పాలు చేయాలని చూస్తోందన్నారు. ఈ విషయాలను రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఎద్దేవా చేశారు. వారి అసమర్థత, వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు వైఫల్యం చేందిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు లేనిపోని కుట్రలు చేస్తుందన్నారు.

ఫోన్ మాట్లాడటం నేరమా..?

ఐదేళ్ల పాటు కొడంగల్ ప్రజలకు సేవ చేసిన ఓ మాజీ ఎమ్మెల్యేగా బాధితులు నరేందర్‌రెడ్డికి ఫోన్ చేయడం తప్పా..? ఆపదలో ఉన్నవారికి ధైర్యం చెప్పడం, అండగా ఉంటామని ధీమా ఇవ్వడం మినహా నరేందర్‌రెడ్డి చేసిన నేరం ఏమిటని నిలదీశారు. కేసులు, జైళ్లకు భయపడే ప్రసకేస్త లేదని, రాష్ట్ర ప్రజల సంక్షేమం, రక్షణే ధ్యేయంగా బీఆర్‌ఎస్ కొట్లాడుతుందని సబితారెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో కేసీఆర్ నిషాన్ చెరిపేస్తాం అని సీఎం అంటున్నారని, అది ఎప్పటికీ సాధ్యం కాదని తెలిపారు. సీఎం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమ సమస్యలు చెప్పుకొనేందుకు ఎన్నిసార్లయినా లగచర్ల ప్రజలు నరేందర్‌రెడ్డికి ఫోన్లు చేస్తారని, పూర్తి సమాచారం తెలుసుకోకుండా ఇలా అన్యాయంగా వ్యవహరించడం ఏమిటని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. నరేందర్‌రెడ్డి తనతో మాట్లాడినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, హరిప్రియనాయక్, కోవ లక్ష్మి, బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



జైలు బయట బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న సబితారెడ్డి తదితరులు

సంక్షేమ పథకాలు సకాలంలో అందాలి

జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: షెడ్యూల్డ్ కులాల వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను సకాలంలో చేరేలా చూడాలని జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ సంబంధిత అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం సమావేశం మందిరంలో గురువారం కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి షెడ్యూల్డ్ కులాలకు వివిధ పథకాల అమలు తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు పోస్టుమెట్రిక్స్ స్కాలర్‌షిప్‌లు ఏ మేరకు అందుతున్నాయి.. ఎస్సీ జూనియర్ అడ్వొకేట్లకు ప్రోత్సాహకాలు అందుతున్నాయా.. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఎస్సీ కాలనీల్లో రోడ్ల నిర్మాణాలకు ఎంజీఎన్‌ఆర్ స్కీం ద్వారా ఎన్ని నిధులు విడుదలయ్యాయి.. విడుదలైన నిధుల ద్వారా ఎన్ని కాలనీల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టారు తదితర అంశాలపై ఆరాతీశారు.



అధికారులతో మాట్లాడుతున్న వడ్డేపల్లి రాంచందర్

ఎస్సీల భూములకు రక్షణ కల్పించాలి

ఎస్సీ కులాలకు ఇచ్చిన భూముల పరిరక్షణలో రెవెన్యూ శాఖ దృష్టి సారించాలని సూచించారు. ఎస్సీ,ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని అన్నారు. ఎవరైనా కేసులు నమోదు చేస్తే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ఆయా శాఖలు సకాలంలో ఖర్చుచేసి షెడ్యూల్ కులాల వారి సంక్షేమానికి అన్ని శాఖలు కృషి చేయాలని తెలిపారు. ముందుగా కలెక్టరేట్‌కు చేరుకున్న రాంచందర్ కలెక్టరేట్ ఆవరణలో మొక్కను నాటారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామని, ఎక్కడా ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు చేపడతామని తెలిపారు. సమావేశంలో జాతీయ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, మహేశ్వరం డీసీపీ సునీత, ఎల్బీనగర్ డీసీపీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి
అడిషనల్ కలెక్టర్ సుధీర్

అనంతగిరి: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. గురువారం వికారాబాద్‌లోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండలస్థాయి అధికారులు, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్లు సర్వే ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఏమైనా సందేహాలు ఉంటే సూపర్‌వైజర్లు, ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి నివృత్తి చేసుకోవాలన్నారు. గ్రామాల్లో నర్సరీల ఏర్పాటుకు సిద్ధం కావాలన్నారు. మొక్కలు పెంచేందుకు అవసరమైన మట్టిని సేకరించుకోవాలని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి వరకు ఉపాధి హామీ పనులకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వినయ్‌కుమార్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంఈఓ బాబుసింగ్, ఎంపీఓ దయానంద్, ఏఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

క్లుప్తంగా

జిల్లా స్థాయి క్రికెట్‌కు విద్యార్థి ఎంపిక



సలీమ్‌ను అభినందిస్తున్న అల్మాస్ స్కూల్ ప్రతినిధి

తాండూరు టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్–17 బాలుర క్రికెట్ సెలక్షన్స్‌లో తాండూరుకు చెందిన విద్యార్థి అర్హత సాధించాడు. స్థానిక అల్మాస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న మహ్మద్ సలీమ్ అనే విద్యార్థి జిల్లా తరపున క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సహచరులు సలీమ్‌ను అభినందించారు.

ద్వాదశి ప్రత్యేక పూజలు



ఆలయంలో తిరుచ్చి ఉత్సవం

కొడంగల్ రూరల్ : పట్టణంలోని పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో గురువారం కౌశిక ద్వాదశి సందర్భంగా ఆలయ పురోహితులు, దేవాలయ ధర్మకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత ఉగ్ర శ్రీనివాస మూర్తి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఉత్సవం అనంతరం ఆస్థాన మండపంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కౌశిక పురాణం విశిష్టతను ఆలయ అర్చకులు భక్తులకు తెలియజేశారు. పాల్గొన్న భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

టిప్పర్ ఢీకొని.. వ్యక్తి దుర్మరణం



ఆశప్ప (ఫైల్)

కొడంగల్ రూరల్: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని అతి వేగంతో వచ్చిన ఓ టిప్పర్ బలిగొంది. ఈ విషాద సంఘటన బుధవారం మండల పరిధిలోని పెద్దనందిగామలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పల్లెర్ల ఆశప్ప(40) వ్యక్తిగత పనుల నిమిత్తం కొడంగల్ చేరుకొని తిరిగి స్వగ్రామానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో నడుచుకుంటూ వెళ్తున్న ఆశప్పను అతి వేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం మృతుడి భార్య యశోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ అశోక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

అనంతగిరి: ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వికారాబాద్ రైల్వే ఎస్ఐ శంకరయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధ్యాహ్నం వికారాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని రైలు పట్టాలపై ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. వెంటనే రైల్వే పోలీసులు అక్కడి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. గుర్తు తెలియని మనిషి(30) ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వ్యక్తిలా కనిపిస్తున్నారన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. పంచనామా చేపట్టి మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు.

ఆటోలో నుంచి పడి కూలీ మృతి

మొయినాబాద్: ఆటోలో నుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఓ వలస కూలీ మృతి చెందారు. ఈ సంఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ మండల పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ రిసార్ట్స్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపుర రాష్ట్రానికి చెందిన స్వపన్‌కుమార్(35) కొంతకాలం క్రితం మొయినాబాద్ మండలానికి వలస వచ్చారు. మండల పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ రిసార్ట్స్‌లో కూలీపని చేస్తూ అక్కడే ఉంటున్నారు. గురువారం మధ్యాహ్నం మొయినాబాద్‌కు వెళ్లి తిరిగి గ్రీన్‌ఫీల్డ్ రిసార్ట్స్‌కు ఆటోలో వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి కిందపడ్డారు. రోడ్డుపై పడటంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యంత్రాల కొరత.. రైతుల వ్యథ

- కూలీలు సైతం దొరకని వైనం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు



పెద్దేముల్ మండలంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

పెద్దేముల్: వరి రైతులకు కష్టాలు తప్పటం లేదు. ఓ వైపు మబ్బులు.. మరో వైపు కూలీలు, యంత్రాలు దొరకకా సరైన సమయంలో కోతలు కావడం లేదు. దీంతో ధాన్యం తూకం కాక రైతులు లబోదిబోమంటున్నారు. ఆరుగాలం శ్రమించి పండించినా ఫలితం లేకుండా పోతుందని ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు కేంద్రాలు లేకున్నా, మార్కెట్లో విక్రయాలు చేసేదని, ప్రస్తుతం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన సరైన సమయంలో తూకాలు కావడంలేదని అన్నదాతలు వాపోతున్నారు.

నేలవారుతున్న వరి

మండలంలో వరి పంటను సాగు చేసిన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వరి కోతకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. పత్తితో పాటు వరి కోతలు ఒకేసారి రావటంతో అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో కూలీలు దొరకకా వరి పొలాలు నేలవారిపోతున్నాయి. దీంతో ఏమి చేయాలంటూ రైతులు దిగులు చెందుతున్నారు. జనగాం, మంబాపూర్, దుగ్గాపూర్, పెద్దేముల్, కొండాపూర్, బుద్దారం, గాజీపూర్, కందనెల్లి, మారేపల్లితండా, మారేపల్లి, మదనంతపూర్‌తో పాటు పలు గ్రామాల్లో అన్నదాతలు సుమారు 3 వేలకు పైగా ఎకరాల్లో వరి పంటను సాగు చేసినట్లు సమాచారం. వరి పంటకు అనువైన నేలలు ఉండటంతో రైతులు ఎక్కువగా సాగుచేస్తున్నారు. ప్రస్తుతం వరి పంటకు బదులు ఇతర పంటలు సాగుచేయాలన్నా పెట్టుబడులు పెట్టలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వేరుశనగ, శనగలతో పాటు ఇతర విత్తనాలు ప్రభుత్వం సబ్సిడీపై అందజేసేది. ప్రస్తుతం వాటిని ఎత్తి వేయటంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

యంత్రాలకు డిమాండ్

వరి కోత యంత్రాలు(హార్వేస్టర్లు) సమయానికి దొరకటం లేదు. గతంలో గంటకు రూ.2,000 ఉండగా డీజిల్ ధర పెరగటంతో రూ.2,500లకు చేశారు. మరి కొంత మంది రూ.3,000 కూడా కోతలు చేస్తున్నారని పలు గ్రామాల రైతులు అంటున్నారు. దానికి తోడు కూలీల కొరత తీవ్రంగా ఉంది. రోజుకు రూ.500లు చెల్లించినా దొరకటం లేదు. దీంతో పంట నేల పాలయ్యో ప్రమాదం ఉందని పలు గ్రామాల కర్షకులు అంటున్నారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- లగచర్ల ఘటనపై సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య ఆరోపణ
- రైతుల భూములను బలవంతగా సేకరించొద్దని హితవు



మాట్లాడుతున్న వెంకటయ్య

పరిగి: లగచర్లలో ఇటీవల ఫార్మాసిటీ ఏర్పాటు కోసం ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన జిల్లా కలెక్టర్, మిగతా అధికారులపై జరిగిన ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య అన్నారు. గురువారం పరిగి పట్టణంలో సీపీఎం నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యంతోనే ఈ ఘటన జరిగిందని విమర్శించారు. ఓ వైపు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ దాడి జరగలేదని స్వయంగా సామాజిక బాధ్యతతో ప్రకటిస్తే, ప్రభుత్వం, పోలీసు అధికారులు దాడి జరిగిందనే పేరుతో గిరిజనులు, రైతులను భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. పేదల భూములను లాక్కోవాలని రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దిగుతుందన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టాలని చూస్తే సహించబోమని హితవు పలికారు. ఘటన జరిగిన సమయంలో అక్కడ లేని రైతులను సైతం అక్రమంగా కేసులు పెట్టి అరెస్టు చేశారని మండిపడ్డారు. ఫార్మా పేరుతో దుద్యాల, కొడంగల్, బొంరాస్‌పేట్ మండలాల్లో ఇంటర్నెట్ కట్ చేసి ఆ గ్రామాల ప్రజలకు రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛ, హక్కులను ప్రభుత్వం కాలరాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఆరు నెలల నుంచి లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, పులిచర్ల, రోటిబండతండా రైతులు తమకు ఫార్మా వద్దు అని అనేక రూపాల్లో పోరాటాలు చేస్తుంటే, వారికి వ్యతిరేకంగా ప్రభుత్వం భూములను తీసుకోవాలని ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. చిత్తశుద్ధి ఉంటే కొడంగల్‌లో 1154 ఎకరాల్లో ఉన్న సిలింగ్ భూములను సేకరించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భూములు కోల్పోతున్న రైతులను సంఘటితం చేసి ప్రజాస్వామ్యయుతంగా పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, సత్యయ్య, రఘురాం, శేఖర్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్తీక దీపోత్సవం

కొడంగల్ రూరల్ : పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయ ఆవరణలో శుక్రవారం సాయంత్రం కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు హిందూవాహిని, యువవాహిని కొడంగల్ శాఖ సభ్యులు తెలిపారు. భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుంటూ దీపోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ ఆర్ఎం

తాండూరు టౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార నిమిత్తం శుక్రవారం డయల్ యువర్ ఆర్ఎం (రీజనల్ మేనేజర్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ సురేశ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. రవాణాలో ప్రయాణికులకు ఎదురవుతున్న సమస్యలు, సూచనలు, సలహాలను 9959226251 ఫోన్ నంబర్‌కు కాల్ చేసి తెలియపరచాలని కోరారు. తాండూరు డివిజన్ పరిధిలోని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తాండూరు రూరల్: అనుమతి లేకుండా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను కరన్‌కోట్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. యాలాల మండలం అగ్గనూర్ గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లు కాగ్నా నది నుంచి రాత్రి సమయంలో ఇసుకను తరలిస్తున్నారు. గురువారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కరన్‌కోట్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తాండూరు రూరల్: అనారోగ్యం బాధపడుతూ చికిత్స పొందుతున్న ఓ అనాథ మహిళ గురువారం మృతి చెందింది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని కరన్‌కోట్ గ్రామానికి చెందిన లక్ష్మి(45) భర్త సీసీఐ ఫ్యాక్టరీలో పని చేస్తూ గతంలో మృతి చెందాడు. దీంతో ఎవరూ లేకపోవడంతో గ్రామంలో అనాథగా నివాసిస్తోంది. కొంత కాలంగా అనారోగ్యం బాగలేకపోవడంతో తాండూరు పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. గురువారం ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

మీదికుంట వాకింగ్ బ్రిడ్జి ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: మియాపూర్ పరిధిలోని మీదికుంట సరస్సు వద్ద నూతనంగా నిర్మించిన వాకింగ్ బ్రిడ్జ్‌ను బాలల దినోత్సవం నేపథ్యంలో ఫౌంటెన్‌హెడ్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ప్రారంభించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా చేపట్టిన నిధుల సమీకరణతో పాటు స్కూల్ విద్యార్థులు, సేవ్ వాటర్ అండ్ సేవ్ నేచర్ ఎన్జీఓ సహకారంతో నిర్మించిన ఈ వంతెనను ప్రారంభించి సమాజానికి అంకితం చేశారు. 2020లో సరస్సు పునరుజ్జీవనం చేసినప్పటి నుంచి సరస్సు పరిరక్షణకు విద్యార్థులు చూపుతున్న అంకితభావాన్ని సరస్సు చుట్టుపక్కల కమ్యూనిటీలు అభినందించాయి.

వివాహిత మిస్సింగ్

శంకర్‌పల్లి: ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన గురువారం మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామానికి చెందిన శంకరయ్య కూతురు లావణ్య(35)కు 8 ఏళ్ల క్రితం వివాహం జరగ్గా.. కొన్నేళ్ల నుంచి భర్తతో దూరంగా ఉంటుంది. దీంతో ఆమె పుట్టింట్లోనే ఉంది. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన ఆమె సాయంత్రం అయినా తిరిగి రాలేదు. తండ్రి చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం మోకిల పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దాడులకు దిగడం సరికాదు



నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

- టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్


అనంతగిరి: అధికారులపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని, నిందితులను కఠినంగా శిక్షించాలని టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఎం.శివకుమార్ కోరారు. లగచర్లలో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడులకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలపాలని రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, టీఎన్జీఓఎస్ రాష్ట్ర పిలుపు మేరకు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. సమస్యలు ఉంటే ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి తప్ప భౌతిక దాడులకు దిగడం సరికాదన్నారు. దాడులు చేస్తే యూనియన్ నుంచి తప్పక ఖండిస్తామన్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అజ్మత్ పాషా, జిల్లా కోశాధికారి రమేశ్, జాయింట్ సెక్రెటరీ హీరాలాల్, తాలూకా ప్రెసిడెంట్ మల్లేశం, పరిగి తాలూకా ప్రెసిడెంట్ వెంకటేశ్, క్లాస్ ఫోర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాలకృష్ణ, పెన్షనర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మొయినాబాద్: దంపతులు గొడవ పడి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌కు చెందిన దాసరి రాజా(35), దాసరి జమున దంపతులకు ఇద్దరు మగపిల్లలు. వారు నాగిరెడ్డిగూడలో చదువుతున్నారు. ఈ నెల 8న భార్యాభర్తలు పిల్లలను చూడటానికి గ్రామానికి వచ్చారు. అదే రోజు సాయంత్రం దంపతులు గొడవ పడ్డారు. దీంతో రాజా పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. చికిత్స కోసం అతన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

క్రీస్తు ఉత్సవానికి భక్తుల రాక

- ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరకు భారీగా వస్తున్న యాత్రికులు



బీదర్ నుంచి ధారూరుకు వస్తున్న ఏసు భక్తులు

ధారూరు: ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ ఉత్సవాలు గురువారానికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఉదయం నుంచే యాత్రికుల రాక ముమ్మరమైంది. కర్ణాటకలోని గుల్బర్గా, బీదర్, మహారాష్ట్రలోని బీజాపూర్, సోలాపూర్ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. బీదర్ నుంచి ధారూరు జాతరకు కాలినడకన వేలాదిగా భక్తులు రావడం ప్రారంభమైంది. జాతర ప్రాంగణంలో ఏసుక్రీస్తుకు సంబంధించిన బైబిళ్లు, చిత్ర పటాలు, బ్యానర్లు, ఫొటోలను వ్యాపారులు విక్రయిస్తున్నారు. జాతర ప్రాంగణంలో తెలుగు, కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో క్రీస్తును కొలుస్తూ పాటలు, భజనలు చేశారు.

ఒక్క ఎక్స్‌ప్రెస్ మాత్రమే ఆగింది

గురువారం బెంగళూర్–నాందెడ్, నాందెడ్–బెంగళూర్ ఎక్స్‌ప్రెస్ మాత్రమే ధారూరు రైల్వేస్టేషన్‌లో ఆగివెళ్లాయి. ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వలేరు. దీంతో వివిధ రాష్ట్రాల నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లలో వచ్చిన భక్తులు వికారాబాద్, తాండూర్ రైల్వే స్టేషన్లలో దిగి బస్సుల ద్వారా జాతరకు చేరుకున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులలో విశ్వాసులు వచ్చారు.



ఏసుక్రీస్తు కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

వైద్యం వికటించి..

- చచ్చుబడిన వృద్ధురాలి కాలు
- రెండు నెలల క్రితం ఘటన
- బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన జిల్లా వైద్యాధికారులు
- తాండూరులో ప్రైవేట్ క్లినిక్ సీజ్



ఆర్ఎంపీ ముఖీద్‌ను విచారిస్తున్న వైద్యాధికారులు

తాండూరు టౌన్: మోకాలి నొప్పితో వైద్యం కోసం వచ్చిన ఓ వృద్ధురాలికి అదే మోకాలికి ఇంజెక్షన్లు ఇచ్చి ఆమె కాలు చచ్చుబడిపోయేలా చేశాడు ఓ ఆర్ఎంపీ వైద్యుడు. రెండు నెలల క్రితం జరిగిన ఈ ఘటన జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. యాలాల మండలం దౌలాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మీబాయి అనే వృద్ధురాలు మోకాలి నొప్పితో తాండూరు పట్టణంలోని షిఫా క్లినిక్ నడిపే ఆర్ఎంపీ వైద్యుడు ముఖీద్ వద్దకు వచ్చింది. నేరుగా మోకాలి కీలుకు మూడు ఇంజెక్షన్లు ఇచ్చిన వైద్యుడు తగ్గుతుందని చెప్పి ఇంటికి పంపించేశాడు. ఆరోజు నుంచి ఇన్ఫెక్షన్ సోకడంతో కాలు చచ్చుబడి పోయింది. వైద్యున్ని కుటుంబ సభ్యులు నిలదీయగా తిరిగి నయం చేస్తానని నమ్మబలికాడు. ఎంతకూ నయం కాకపోవడంతో మెరుగైన వైద్యం కోసం తాండూరుతో పాటు హైదరాబాద్‌లోని పలు ఆసుపత్రులు తిరిగారు. కానీ ఫలితం లేకపోవడంతో రెండు రోజుల క్రితం బాధితురాలి కుమారుడు హీర్యానాయక్ పోలీసుస్టేషన్, సబ్‌కలెక్టర్‌తో పాటు జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేశాడు. గురువారం వికారాబాద్, తాండూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ జీవరాజ్, రవీంద్ర యాదవ్ క్లినిక్‌కు వెళ్లి వైద్యున్ని విచారించారు. బాధితురాలిని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా విచారణాధికారులు మాట్లాడుతూ.. సర్టిఫైడ్ ఆర్థోపెడిషియన్ ఆపరేషన్ థియేటర్‌లో చేయాల్సిన వైద్యం అర్హతలేని ఆర్ఎంపీలు చేయడం సరికాదన్నారు. ఈమేరకు క్లినిక్‌ను సీజ్ చేసి, ఘటనకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు చెప్పారు. అలాగే సదరు ఆర్ఎంపీ ముఖీద్‌పై కూడా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆర్ఎంపీ సర్టిఫికెట్లు, క్లినిక్‌లు, ల్యాబ్‌లను వెంటనే రిజిస్టర్ చేయించుకోవాలని, లేనిచో వారిపై చర్యలు తప్పవన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఈశ్వరప్ప తదితరులు

- ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప

దోమ: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప అన్నారు. గురువారం మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో బీజేపీ నేతలతో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని అన్నారు. అమలు కాని హామీలతో కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పాలనను ప్రజలు మెచ్చుకుంటున్నారని అన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి నేరుగా అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా పరిగి అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బాల్‌రాజ్, పార్టీ మండల అధ్యక్షుడు అనంతయ్య, నాయకులు మహేశ్, నర్సింహులు, నర్సింహ, మల్లేశ్, అశోక్, శివ, శ్రీనివాస్, వెంటకయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న నందిని అగసార

- అథ్లెటిక్ నందిని అగసారా
- ముగిసిన జోనల్ స్పోర్ట్స్ మీట్

అనంతగిరి: కష్టపడితే అసాధ్యం సైతం సుసాధ్యమవుతుందని ఇంటర్నేషనల్ అథ్లెటిక్ చాంపియన్ నందిని అగసారా అన్నారు. ఈ మేరకు గురువారం వికారాబాద్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలలో జరిగిన 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి నుంచే లక్ష్యాన్ని ఎంచుకుని ఇష్టంతో సాధన చేసినట్లయితే తప్పనిసరిగా లక్ష్యాన్ని ఛేదించవచ్చన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం లభిస్తుందన్నారు. గురుకుల పాఠశాలలో ఉన్నటువంటి సౌకర్యాలు మరెక్కడ లేవన్నారు. ఇక్కడ క్రీడల్లో తర్ఫీదు పొందితే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలమన్నారు. అనంతరం జిల్లా వైద్యాధికారి వెంకటరవణ మాట్లాడుతూ.. విద్యార్థులు ఏదైన సాధించాలంటే ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పినట్లుగా నడుచుకోవాలని ప్రతి ఆలోచన విజయం వైపు దూసుకెళ్లే విధంగా ఉండాలని అన్నారు. ఓవరాల్ చాంపియన్‌గా శివారెడ్డిపేట పాఠశాల విద్యార్థులు నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమాదేవి, డాక్టర్ నిఖిల్, పలువురు వ్యాయమ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నియమ నిబంధనలు తప్పనిసరి



శంకర్‌పల్లి: మాట్లాడుతున్న అధికారులు

- వాహనదారులను హెచ్చరించిన పోలీసులు



చేవెళ్ల: ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చేవెళ్ల: రోడ్డుపైకి వచ్చే ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌చార్జి సీఐ గణేశ్, సీఐ భూపాల్ శ్రీధర్, డీఐ రమేశ్‌నాయుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం సాయంత్రం సివిల్, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాపిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు తమ వాహనంలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొదని సూచించారు. డ్రైవర్లు కచ్చితంగా లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడపరాదని ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో చేవెళ్ల సివిల్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి పీఎస్‌లో అవగాహన

శంకర్‌పల్లి: ప్రభుత్వ నిబంధనలను ఆటో, క్యాబ్ డ్రైవర్లు కచ్చితంగా పాటించాలని శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్, మోకిల సీఐ వీరబాబు, చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌చార్జి సీఐ గణేశ్ అన్నారు. గురువారం శంకర్‌పల్లి పీఎస్ ఆవరణలో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు మాట్లాడుతూ.. డ్రైవర్లు కచ్చితంగా యూనిఫాం, డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు. ఆటో, కారుకి ఇన్సూరెన్స్ తప్పనిసరి అన్నారు. డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, అలాంటి వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపొద్దని సూచించారు.

వ్యక్తి అదృశ్యం

మొయినాబాద్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాకుండా పోయిన సంఘటన మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి రమేశ్ క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 12న మధ్యాహ్నం ఆయన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో గురువారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.